andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.8, కనిష్ఠం 14.2

కామారెడ్డి జిల్లా వార్తలు

5

గురువారం 13 నవంబరు 2025





సోయా కొనుగోళ్లలో.. కొర్రీలు

కామారెడ్డి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ వానా కాలం సీజన్‌లో భారీ వర్షాలు కురవడంతో సోయా పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపగా ఇప్పటికైనా నష్టపోయిన రైతులు కొనుగోళ్లపై ప్రభుత్వం కొర్రీలు విధించడంతో పంటను ఎక్కడ అమ్ముకోవాలో తెలియక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంటను మార్కెట్‌లోకి తీసుకువచ్చేసరికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సవాలక్ష నిబంధనలు ఉండడంతో పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సోయాలో మట్టి పెళ్లలు ఉన్నాయని, తేమ శాతం రావడం లేదని కొనుగోలు కేంద్రాల్లో కాంటా జరగడం లేదు. ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేట్ డీలర్లు, దళారులు మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. దళారులు చెప్పిందే శాసనం అన్నట్లు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి సోయా పంటను ఆరబెట్టలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తేమ శాతం, ఇతర నిబంధనలను సడలించి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

- కేంద్రంలో నిబంధనల కొర్రీలతో రైతుల ఆందోళన
- మట్టి పెళ్లలు ఉన్నాయంటూ కొనుగోలు చేయని పరిస్థితి
- నాణ్యత లేని సోయాను తిరస్కరిస్తున్న నాఫెడ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు
- తేమ శాతం లేకపోవడంతో కొనుగోలు చేయని మార్క్‌ఫెడ్
- సోయా కొనుగోళ్లలో నిబంధనలను సడలించాలని రైతుల డిమాండ్
- ఇప్పటి వరకు 2వేల క్వింటాళ్ల కొనుగోలు

6.40 లక్షల క్వింటాళ్లలో దిగుబడులు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో వేల ఎకరాల్లోనే సోయా పంట సాగైంది. ఈ సీజన్‌లో రైతులు పత్తి, మొక్కజొన్న పంటల నుంచి సోయా వైపు మళ్లారు. ప్రధానంగా జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, పెద్దకొడప్‌గల్, తాడ్వాయి, రాజంపేట, సదాశివనగర్, గాంధారి తదితర మండలాల్లో వేల ఎకరాల్లో రైతులు సోయా పంటను సాగు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఈ వర్షాకాలం సీజన్‌లో 80 వేల ఎకరాలకు పైగా సోయా పంట సాగైంది. ఈ సీజన్‌లో భారీ వర్షాల కారణంగా సోయా దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది. ఆశించిన మేర దిగుబడులు రాక పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. అయితే 6.40 లక్షల క్వింటాళ్లలో సోయా దిగుబడులు వస్తాయని ఇందులో 1.70 లక్షల క్వింటాళ్లలో సోయా కొనుగోళ్లకు మార్క్‌ఫెడ్ లక్ష్యంగా పెట్టుకుంది.

9 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో సోయా కొనుగోళ్లను చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 9 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే మద్నూర్ మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మద్నూర్‌తో పాటు బిచ్కుంద, పిట్లం, జుక్కల్ ప్రాంతాల్లోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5,328లు (మిగతా 8లో..)



బిచ్కుందలో ధర్నా నిర్వహిస్తున్న రైతులు

సోయా కొనుగోళ్లు చేపట్టాలి

బిచ్కుంద, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో సోయా కొనుగోళ్లను చేపట్టాలని రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 45 రోజులుగా మార్కెట్ యార్డ్‌లో సోయాలను ఎండబెడుతున్నా అధికారులు ఏదో రకంగా కొర్రీలు పెట్టి కొనుగోళ్లను సరిగా చేపట్టకపోవడం తగదని అన్నారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు తేమ శాతం పరిశీలించి తూకం వేసిన తర్వాత అందులో పూర్తిగా మట్టి వచ్చిందంటూ తిరస్కరించడం సమంజసం కాదన్నారు. సోయా పంట కోతల సమయంలో వర్షాలు కురవడంతో చిన్న పాటి సైజు మట్టి వస్తుందని అంత మాత్రానా రిజెక్ట్ చేయడం తగదు అని అన్నారు. వెంటనే సోయాను కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ రవీందర్, ఎస్సై మోహన్‌రెడ్డి రైతులతో మాట్లాడి తగిన న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

సోయా కొనుగోళ్లు చేస్తున్నాం

- శశిధర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ అధికారి, కామారెడ్డి



జిల్లాలో ఇప్పటికే సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. జిల్లా వ్యాప్తంగా 9 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. మార్క్‌ఫెడ్‌తో పాటు నాఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు జరుగుతున్నాయి. ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారమే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే సోయాలో అత్యధికంగా మట్టిపెళ్లలు వస్తుండడంతో క్వాలిటీసెల్ అధికారులు పరిశీలించి కొనుగోళ్లు చేస్తున్నారు. మట్టి పెళ్లలు ఉంటే తిరస్కరిస్తున్నారు. ఇప్పటి వరకు 2 వేల క్వింటాళ్ల సోయాను కొనుగోలు చేశాం.



అక్కంపల్లిలో ఇంటికి ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన మంగలి ఈశ్వరమ్మ

'ఇందిరమ్మ' బిల్లు మంజూరు చేయాలి

- బిల్లులు రాకపోవడంతో ఇంటికి ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన మహిళ

నాగిరెడ్డిపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిపేట మండలంలోని అక్కంపల్లి గ్రామానికి చెందిన మంగళి ఈశ్వరమ్మ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటికి బిల్లులు మంజూరు కాకపోవడంతో బుధవారం ఆమె తన ఇంటికి ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేసింది. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని నిబంధనల ప్రకారం తాను ఇంటి నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంటి నిర్మాణం కోసం తన దగ్గర డబ్బులు లేకపోవడంతో సుమారు రూ.7లక్షల వరకు అప్పులు చేసి ఇంటిని నిర్మించుకున్నానని తనకు ఇప్పటి వరకు ఒక్క బిల్లు కూడా రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. నిరుపేద కుటుంబానికి చెందిన తాను వితంతురాలినని నిర్మించుకున్న ఇంటికి బిల్లులు మంజూరు చేసి తనను ఆదుకోవాలని ఆమె ప్రభుత్వ అధికారులను, నాయకులను కోరుతోంది.

నిబంధనలకు వ్యతిరేకంగా ఇంటి నిర్మాణం

- గ్రామ పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య

గ్రామంలో మంగళి ఈశ్వరమ్మ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా లేదని గ్రామ పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తెలిపారు. తాము ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ఆమెకు మార్కింగ్ చేసిన స్థలంలో కాకుండా అప్పటికే పక్కన నిర్మించుకున్న బేస్మిట్‌పైన ఇంటి నిర్మాణం చేసిందన్నారు. ఇంటి నిర్మాణం నిబంధనల ప్రకారం లేనందు వల్ల ఆమెకు బిల్లులు రావడం లేదని కార్యదర్శి తెలిపారు.



ప్రాజెక్టు గేటు నుంచి విడుదల అవుతున్న నీరు

సాగర్‌కు వరద తగ్గుముఖం

నిజాంసాగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీరు బుధవారం నాటికి తగ్గుముఖం పట్టింది. మంజీరా నది వెంట 2,498 క్యూసెక్కుల వరద నీరు ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుందని, వీఆర్ నెంబర్ 5లోని ఒక గేటును ఎత్తి నీటిని మంజీరా నదిలోకి వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1405 అడుగుల నీటి సామర్థ్యం ఉంది.

ఆటోలో వెంబడించి దారి దోపిడీ

- బంగారు పుస్తెల తాడు, నగదు లాక్కెళ్లిన అగంతకుడు

వేములవాడ టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడలోని నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి దర్శనానికి ఆటోలో వెళుతున్న భక్తులను లక్ష్యంగా చేసుకున్న అగంతకుడు వెంబడించి బుధవారం దారి దోపిడీకి పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన దేవుపల్లి బూధవ్వ, చంద్రయ్య అనే వృద్ధ దంపతులు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనం చేసుకొని నాంపల్లికి వెళుతున్నారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుంచి నాంపల్లి దేవాలయానికి వెళ్లేందుకు భక్తులు ఆటోలో ఎక్కగా మార్గమధ్యలో ఒక వ్యక్తి, మరోచోట ఇంకో వ్యక్తి ఎక్కారు. నాంపల్లి కమాన్ వద్ద భక్తులు దిగగానే అగంతకుడు దిగి వారిని వెంబడించి నడుచుకుంటూ వెళుతున్న దంపతులను చంపుతానని బెదిరించి రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడు, రూ. 2వేల నగదు లాక్కొని పరారయ్యాడు. ఈ సంఘటనపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

కాలభైరవ స్వామి ఆలయంలో వైభవంగా డోలారోహణం

రామారెడ్డి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాలభైరవ స్వామి ఆలయంలో డోలారోహణం(తొట్టి పండుగ) వేడుకలను బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ గర్భగుడిలో ఈవో బూర్ల ప్రభుగుప్తా నేతృత్వంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. డోలారోహణం నిర్వహిస్తుండగా భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు స్వామి వారికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మేరకు ఆలయ పరిసరాలు ఓం ఓం భైరవ నామస్మరణతో మారుమోగాయి. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతల సహకారం ఎల్లప్పుడు ఉంటుందని అన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కరీంనగర్, మెదక్, సిరిసిల్లా, కరీంనగర్, హైదరాబాద్, సిద్దిపేట్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరు కాగా సాయంత్రం గ్రామస్థులు ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి, అన్నదాన సత్రం చైర్మన్ గంజి సతీష్‌గుప్తా, కైలాస్ రాజేశ్వర్ రావు గుప్తా, దోమకొండ శ్రీనివాస్ గుప్తా, పురోహితులు వంశీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కాలభైరవ స్వామిని అలంకరించిన దృశ్యం

గోపాల మిత్రలకు వేతన వెతలు

- 8 నెలలుగా అందని వేతనాలు
- దయనీయ స్థితిలో గోపాలమిత్రలు
- ఉమ్మడి జిల్లాలో 121 మంది విధులు



7

అసలే చలికాలం.. ఆపై చన్నీటి స్నానం

- వసతి గృహాల్లో సౌకర్యాల లేమి..
- చన్నీటి స్నానాలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



7



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

రోడ్డు పనులను పూర్తి చేయాలి

పిట్లం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పిట్లం మద్దెల చెరువు రహదారి గుంతలమయంగా మారడంతో ప్రయాణం చేయడం నరకప్రాయంగా మారిందని పోతిరెడ్డిపల్లి గేటు వద్ద బుధవారం పోతిరెడ్డిపల్లి తండా వాసులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దెల చెరువు పిట్లం రహదారి పనులు గతంలో చేసిన కాంట్రాక్టర్ అటవీ శాఖ అడ్డంకులతో ఆయా గ్రామాల వద్ద పనులు నిలిపివేసి వెళ్లిన విషయం తెలిసింది. గత ఆరు నెలల క్రితం కాంట్రాక్టర్ నిలిచిన పనులను చేసి నిలిపివేయడంతో రోడ్డుపై కంకర తేలి గుంతలమయంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించిన గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నిలిచిన రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో గల మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాలకు కావాల్సిన మంచినీటి వసతి కల్పించాలని మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మార్చిలోగా నాణ్యతతో కూడిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న వైట్‌కోట్ సెరిమని కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు వైద్యవృత్తిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, సేవా భావంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వాల్య, వైస్ ప్రిన్సిపాల్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మినీ రైస్‌మిల్ పనితీరు పరిశీలన

కామారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం మినీ రైస్‌మిల్ పనితీరును కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఇటువంటి యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా రైతులు, స్థానిక మహిళ సంఘాలకు ఆర్థిక లాభం కలుగుతుందని తెలిపారు. గంటకు సుమారు 250 కిలోల వడ్లను ప్రాసెసింగ్ చేసి బియ్యంగా మారుస్తుందని, సింగిల్‌ఫేస్ కరెంట్ సరిపోతుందని అలాగే పాలీష్ స్థాయిని అవసరానికి అనుగుణంగా నియంత్రించే సదుపాయం ఉందని తెలిపారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎంట్రీ చేయాలి

కామారెడ్డి రూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం వివరాలను ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని (మిగతా 8లో..)



కామారెడ్డి ఎంఈవో కార్యాలయంలో వృథాగా పడి ఉన్న ఉల్లాస్ పుస్తకాలు

ఉల్లాస్.. ఉత్తదేనా?

- పూర్తిగా విఫలమవుతున్న ఉల్లాస్ కార్యక్రమాలు
- పల్లెల్లో తూతూ మంత్రంగా బోధన
- వృథాగా పడి ఉన్న అక్షరాస్యత పుస్తకాలు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

కామారెడ్డి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలులోకి తీసుకువచ్చింది. ఇందుకు తగ్గటుగానే జిల్లా యంత్రాంగం ఓ లక్ష్యాన్ని ఏర్పాచుకొని నిరక్షరాస్యులను గుర్తించారు. అయితే క్షేత్ర స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమం అమలు కావడం లేదు. ప్రధానంగా కామారెడ్డి మండలంలో ఉల్లాస్ ఉత్తదేనా అన్న ప్రశ్నలు మహిళా సంఘాల్లోని సభ్యుల్లో మెదులుతోంది. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులకు అవగాహన కోసం అందించాల్సిన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయడం ఎంఈవో కార్యాలయంలోనే రోజుల తరబడి వృథాగా పడవేయడమే ఇందుకు నిదర్శనం. ఇప్పటికీ మండల పరిధిలో నిరక్షరాస్యులను గుర్తించినప్పటికీ వారి చేత అక్షరాలు చదివిపించిన రోజులు లేకపోయేయాని సదరు మహిళలు చెబుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ, సమీక్షలు లేకపోవడంతోనే క్షేత్ర స్థాయిలో నిరక్షరాస్యులకు ఉల్లాస్ పథకం అమలు అవడం లేదని స్పష్టమవుతోంది. కేవలం కామారెడ్డి మండలంలోనే కాకుండా జిల్లాలోని పలు మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

మండలంలో 547 మహిళా సంఘాలు

కామారెడ్డి మండల పరిధిలో 12 గ్రామాలు ఉండగా ఇందులో మొత్తం 542 మహిళ సంఘాలు కొనసాగుతున్నాయి. ఈ మహిళా సంఘాల్లో 5,542 మంది సభ్యులు ఉండగా ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 1300ల మందిని నిరక్షరాస్యులను, 4,242 మంది అక్షరాస్యులను గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. ఉల్లాస్‌లో భాగంగా నిరక్షరాస్యులైన మహిళలకు విద్యా బోధన చేయడానికి 60 మంది (మిగతా 8లో..)

పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొన్న లారీ

- హోంగార్డుకు గాయాలు, కానిస్టేబుల్ పరిస్థితి విషమం

కామారెడ్డి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెట్రోలింగ్ నిర్వహిస్తున్న హైవే పెట్రోలింగ్ వాహనాన్ని వెనక నుంచి ఓ లారీ ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి మండలం క్యాసంపల్లి శివారులో గల జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారు జామున పెట్రోలింగ్ వాహనం యూటర్న్ తీసుకుంటుండగా అతివేగంగా వస్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వాహనంలో గల సైదయ్య అనే కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్, హోంగార్డు స్వామిరెడ్డికి స్వల్ప గాయాల య్యాయి. దీంతో వీరిని చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే సైదయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కాగా ప్రమాదానికి కారణమైన అనుమతి లారీని ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సంఘటన స్థలానికి దేవునిపల్లి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన పోలీసు పెట్రోలింగ్ కారు





రోడ్డు ప్రమాదంలో గాయపడిన పోలీసులు

క్రైం సమాచారం

యువకుడి ఆత్మహత్య


ప్రతాప్ గౌడ్ (ఫైల్)

ఎడపల్లి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): యువకుడు క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయంతో రెండు పెళ్లి కుటుంబాల్లో చీకటి అలుముకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మంగల్‌పాడ్‌కు చెందిన చేపూర్ ప్రతాప్ గౌడ్‌కు బాన్సువాడ నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో ఈ నెల 13వ తేదీన పెద్దలు పెళ్లి ముహూర్తం ఖరారు చేశారు. పెళ్లి తంతులో భాగంగా మంగళవారం వరుడి ఇంట్లో పోచమ్మ పండుగ నిర్వహించాలని కుటుంబీకులు సన్నాహాల్లో ఉండగా సోమవారం నుంచి వరుడు కనిపించకుండా పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. పక్కనే ఉన్న రాణాకలాన్ శివారులో యువకుడి బైకు కనిపించడంతో కుటుంబీకులకు విషయాన్ని తెలియజేశారు. ఆ చుట్టుపక్కల తెలుపగా వెతకడంతో ఉరేసుకొని కనిపించాడు. పోలీసులు సమాచారం అందుకొని ఘటనాస్థలానికి చేరుకున్నారు. పోలీసులు శవ పంచనామా నిర్వహించి బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


సంగమేశ్వర్(ఫైల్)

లింగంపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐలాపూర్‌కు చెందిన మన్నె సంగమేశ్వర్ (39) గత నెల 10న షార్జాలో మృతిచెందారు. అతడి మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. సంగమేశ్వర్ బతుకు దెరువు కోసం గతేడాది దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడ పని చేస్తున్న కంపెనీలో గతనెల 10న ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని తెప్పించేందుకు కుటుంబీకులు తిప్పలు పడ్డారు. చివరికి దుబాయ్‌లోని భారత్ సేవా సమితికి చెందిన బొమ్మ ప్రవీణ్‌ను సంప్రదించగా.. కంపెనీతో మాట్లాడి షార్జా నుంచి హైదరాబాద్‌కు బుధవారం వచ్చే ఏర్పాటు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హైదరాబాద్ నుంచి స్వగ్రామం ఐలాపూర్‌కు మృతదేహాన్ని తరలించేందుకు హైదరాబాద్‌కు చెందిన కంచర్ల శ్రీనివాస్ అంబులెన్స్ ఏర్పాటు చేశారన్నారు.

కుల బహిష్కరణ కేసులో రిమాండ్

భిక్కనూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మంత్రాలు చేస్తుందని ఆరోపిస్తూ ఒక మహిళను కుల బహిష్కరణ చేసి జరిమానా విధించిన ఐదుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. జంగంపల్లి గ్రామానికి దొడ్ల గౌరవ్వలో మంత్రాలు చేస్తుందని ఆరోపిస్తూ.. అదే గ్రామానికి చెందిన కులస్థులు ఇటీవల పంచాయితీ నిర్వహించారు. జంగంపల్లి గ్రామానికి చెందిన దొడ్లె రాజయ్య, ఉప్పలవాయి రాజయ్య, బొమ్మని పెద్ద పోచయ్య, జనగామకు చెందిన బోడపట్ల దేవయ్య, భిక్కనూరుకు చెందిన బోడ పరుశరాములు ఆమెను కుల బహిష్కరణ చేసి రూ.2.77లక్షల జరిమానా విధించి రూ.15వేలను బలవంతంగా ఆమె నుంచి వసూలు చేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. ఘటనకు కారణమైన ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

గొలుసు చోరీ.. నిందితుడి అరెస్టు

కామారెడ్డిటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గొలుసు దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ చైతన్యరెడ్డి తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. వివేకానంద కాలనీలోని కొండ లలిత ఇంటి వద్దకు గుర్తుతెలియని వ్యక్తి వచ్చి తాగు నీరు అడిగాడు. దీంతో ఆమె లోపలికి వెళ్లి నీరు తీసుకొచ్చి, కొద్దిగా మేష్ డోర్‌ను తెరిచి ఇవ్వగా అవి తాగిన అనంతరం మరికొన్ని కావాలని అడగగా.. మరోమారు సుకొచ్చింది. నీరు తాగిన అనంతరం మెష్‌డోర్ వేసేక్రమంలో సదరు వ్యక్తి డోర్‌ను గట్టిగా లాగి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. దీంతో మంగళవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగిన ఇంటికి కొద్దిదూరంలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి తిరుగుతుండటంతో ఆ మార్గం గుండా వెళ్తున్న వారు గుర్తించి విచారించారు. దీంతో గొలుసు దొంగతనం చేసిన విషయాన్ని బయటపెట్టడంతో వారు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి నాందేడ్‌కు చెందిన రోహిత్ మారుతి అని ఆన్‌లైన్ గేమ్‌కు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి వద్ద 13గ్రా.ల బంగారు గొలుసు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని ఏఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ నరహరి తదితరులు పాల్గొన్నారు.

పాన్ షాప్‌లో దొంగతనం..

నవీపేట: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలోని ఆర్ఆర్ పాన్ షాప్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు ముజాఫర్, పోలీసుల కథనం ప్రకారం.. దొంగ ముఖానికి టవాల్ చుట్టుకుని అర్ధరాత్రి పాన్‌షాప్ తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించాడు. పాన్‌షాప్‌లో ఉన్న కొంత నగదు, చిల్లర డబ్బులతో పాటు పలు సిగరేట్ డబ్బాలను ఎత్తుకెళ్లాడు. ఈ దృశ్యాలు పాన్‌షాప్‌లో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి పాన్‌షాప్ నుంచి బయటకు వెళ్తుండగా అదే మార్గంలో వెళ్తున్న పోలీసులను చూసి భయంతో కొంత చిల్లర డబ్బులను రోడ్డుమీద పడేసి పారిపోయాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మత్స్యకారులపై కేసు

రెంజల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్గాం శివారులో గల గోదావరి నదిలో అనుమతులు లేకుండా నిషేధిత వలతో చేపలు పడుతున్న వారిపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. బోధన్‌కు చెందిన కోటయ్య ఆంధ్రప్రదేశ్ నుంచి కూలీలను తీసుకొచ్చి గోదావరిలో అనుమతి లేకుండా కూలీలతో చేపలు పట్టడంతో ఫిషరీష్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లాయక్ మొయినోద్దీన్ ఫిర్యాదు మేరకు మత్స్యకారులపై కేసు నమోదు చేశామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా

మోపాల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి ద్విచక్రవానం నడిపిన నరేందర్‌కు రూ.10వేల జరిమానా విధించినట్లు ఎస్సై సుష్మిత తెలిపారు. మంగళవారం వాహనాల తనిఖీ చేయగా.. కులాస్‌పూర్ గ్రామానికి చెందిన నరేందర్ పట్టుబడ్డారు. బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు వెల్లడించారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ముగ్గురికి సెకండ్‌క్లాస్ స్పెషల్‌కోర్ట్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ బుధవారం జరిమానా విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో పట్టణానికి చెందిన భూమేష్, ఉమ్మెడకు చెందిన ముత్తన్న, మైలారం గ్రామానికి చెందిన శ్రీనుకు కౌన్సెలింగ్ నిర్వహించి కోర్టులో హాజరుపర్చామన్నారు. వారికి రూ.10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారన్నారు.

మోర్తాడ్: మండల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమానా విధించారని ఎస్సై రాము తెలిపారు. బట్టాపూర్‌కు చెందిన కిసాన్‌గౌడ్, సుంకెట్‌కు చెందిన తొర్లికొండ బాజన్న, మెట్‌పల్లికి చెందిన మాగారం రాజేశ్‌రెడ్డిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు.

సుభాష్‌నగర్: మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురికి జైలు విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. బుధవారం 12 మందిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ముందర హాజరుపర్చగా నలుగురికి జైలు శిక్ష, మరో 8 మందికి రూ.59వేల జరిమానా విధించారన్నారు.

బోధన్: బోధన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురికి కోర్టు న్యాయాధికారి శేషతల్ప సాయి జైలుశిక్ష విధించారని పట్టణ ఎస్సై భాస్కరచారి తెలిపారు. కొత్త బస్టాండ్ వద్ద వాహనాల చెక్ నిర్వహించగా పట్టుబడ్డ ఘన్‌పూర్ గ్రామానికి చెందిన రవికి రూ.వెయ్యి జరిమానా, 4 రోజుల జైలుశిక్ష, మహారాష్ట్రలోని బిలోలి తాలూకా మంచునూర్‌కు చెందిన మోహన్‌కు రూ.వెయ్యి జరిమానా, 2 రోజుల జైలుశిక్ష విధించారన్నారు. పట్టణంలోని రాకాసిపేటలో ఆరుబయట మద్యం తాగుతున్న వెంకటేష్, శంకర్‌కు ఒక రోజు జైలుశిక్ష విధించారన్నారు. బోధన్‌లో అర్ధరాత్రి బయట తిరుగుతున్న షేక్ ఉజ్‌ఫర్, షేక్ సోహెబ్‌లకు ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి

మానవ అక్రమ రవాణా నేరం

నవీపేట,నవంబరు12(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాకు పాల్పడడం నేరమని, ఇటువంటి వారి పట్ల ప్రతీఒక్కరు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్(బాలికల)లో మహోదయ క్లబ్ ఆధ్వర్యంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. సమాజంలో కొంతమంది పిల్లలకు మాయమాటలు చెప్పి వారిని ఇతర ప్రదేశాలకు తరలిస్తున్నారని ఏసీపీ పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడే వారి పట్ల చట్టం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాయమాటలతో మోసాలకు పాల్పడే వారి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ పాఠశాల గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో విద్యార్థినులు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని, గోడ ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని హెచ్ఎం అనిత కోరారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, మహోదయ క్లబ్ అధ్యక్షుడు సాయిరెడ్డి, శ్రీనివాస్, సూరిబాబు, రవీందర్‌రావు, గంగాధర్, గంగారెడ్డి, సంజీవరెడ్డి తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న విద్యార్థినులు

క్రీడలు జీవితంలో ముఖ్యపాత్ర పోషిస్తాయి

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మెండోర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలు జీవితంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని, యువత క్రీడల్లో రాణించి ఎదగాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంతర్ మండల స్థాయి క్రీడా పోటీలను వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. యువత చెడు అలవాట్లకు అలవాటు పడకుండా ఆటల వైపు ఆసక్తి కనబర్చాలన్నారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని గుర్తు చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో జాతీయ స్థాయి పోటీలు పెట్టితే పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు. తమ కుటుంబం క్రీడా రంగంలో మెలకువలు నేర్చుకున్నావారు ఉన్నారని, ఏం కావాలన్నా సహాయం చేయడానికి ముందు ఉంటానన్నారు. అనంతరం మార్చ్‌ఫాస్ట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన పాఠశాలలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, జిల్లా యువజన క్రీడా అభివృద్ధి అధికారి పవన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లేష్, కబడ్డీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కోళ్ల పెంపకాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సాయాగౌడ్

అతివలు ఆర్థికంగా ఎదగాలి

మోస్రా,నవంబరు12(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీవో సాయాగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు చింతకుంటలో మహిళా మండలి సభ్యులు ఆర్థికంగా ఎదగాలనే ఆశయంతో డ్వాక్రా మహిళా రుణాల సహాయం ద్వారా ఏర్పాటు చేసుకున్న నాటు కోళ్ల పెంపకం, మేకల పెంపకం కేంద్రాలను(యూనిట్)లను ఆయన బుధవారం పరిశీలించారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి డ్వాక్రా గ్రూప్ ఎంతో సహకరిస్తుందని, ఆర్థికంగా ఎదగాలనే ఆలోచన ఉన్న వారు ఉపాధి హామీ పథకం ద్వారా షెడ్ నిర్మాణం ఏర్పాటు చేసుకుంటే డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎం రాచయ్య, ఏపీఎం గంగాధర్, సీసీలు లింగం, గంగామణి, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..



చలి ఇందూరు జిల్లాను వణికిస్తోంది. రాత్రి మొదలైన పొగమంచు ఉదయం 9 గంటలైనా వదలడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెండోర మండల కేంద్రంలో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని పొగమంచు కమ్మేసింది. అప్పుడే సూర్యకిరణాలు పడుతుండగా.. మంచులో నుంచి ఆలయం అద్భుతంగా కనిపించింది. ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. - మెండోర

రేకులపల్లికి ఆర్టీసీ బస్సు నడపాలి


రోడ్డుపై నిరసన తెలుపుతున్న మహిళలు

ధర్పల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకులపల్లికి ఆర్టీసీ బస్సు నడపడం లేదని గ్రామస్థులు గ్రామంలో వాల్గోట్-భీమ్‌గల్ రోడ్డుపై బైఠాయించి బుధవారం పెద్ద సంఖ్యలో ధర్నా నిర్వహించారు. మూడు రోజుల క్రితం ఓ వృద్ధుడు మరణిస్తే ఆయన కూతురు గ్రామానికి రావడానికి సాయంత్రం అయిందన్నారు. ఇలా అన్నింటికి అవస్థలు పడుతున్నామని వాపోయారు. నిజామాబాద్ ఆర్టీసీ డిపో ఇప్పటికైనా గ్రామానికి బస్సును నడపాలని కోరారు.

టీయూ వీసీని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

సుభాష్‌నగర్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీలో 2012లో జరిగిన అక్రమాలపై వీసీ యాదగిరిని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి కలిశారు. యూనివర్సిటీ అభివృద్ధి కోసం ఎంపీ ధర్మపురి అరవింద్ కృషి చేస్తున్నారని, రూ. 20 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఖేలో ఇండియా ద్వారా సింథటిక్ ట్రాక్ నిర్మించడానికి ప్రతిపాదనలు సిదం చేస్తున్నామన్నారు. తెలంగాణ యూనివర్సిటీని రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉండేలా చూడాలని కోరారు. ఎలాంటి అవకాశం ఉన్న కేంద్ర ప్రభుత్వం ఎంపీ అరవింద్ అండగా ఉంటారని పేర్కొన్నారు. వీసీని కలిసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, నాయకులు శ్యాంరావ్, సురేష్, శ్రీనివాస్‌గౌడ్, పరశురాం, లక్ష్మినారాయణ, ఏబీవీపీ నాయకులు పృథ్వీ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాదాల నరేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఓంసింగ్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలి

వేల్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల సలహాదారులుగా నియమితులై తొలిసారి జిల్లాకు వస్తున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఘన స్వాగతం పలకడానికి కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో నిజామాబాద్‌కు తరలిరావాలని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ సలహాదారుడు సుదర్శన్‌రెడ్డికి సన్మాన సభ నిర్వహిస్తారని, మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ శ్రీధర్, నాయకులు నర్సారెడ్డి, నరేందర్, రమణ, రాజేందర్, దామోదర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాగృతి జిల్లా అడ్‌హక్ కమిటీ ప్రకటన

సుభాష్‌నగర్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి సంస్థను బలోపేతం చేయడం కోసం నిజామాబాద్ జిల్లాతో పాటు నియోజకవర్గ అడ్‌హక్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు జాగృతి వ్యవస్థాపకురాలు రాష్ట్ర అధ్యక్షుడు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ ఇల్లా అడ్‌హక్ కమిటీ సభ్యులుగా సుదం రవిచందర్, అవంతికుమార్, ఎంఏ రజక్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనారాయణ, రెహన్ అహ్మద్, విజయలక్ష్మి, పుట్టింటి నవీన్ పటేల్ అధికార ప్రతినిధులుగా తెలంగాణ శంకర్, సంజీవ్, శేఖర్‌రాజ్, సంతోష్‌నాయక్, తిరుపతి రాములను నియమించారు. బోధన్ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీ సభ్యులుగా ప్రవీన్‌కుమార్, రాఘవేందర్‌యాదవ్, నూర్ ఫతేపూర్, భవానిపేట్ శ్రీనివాస్, సాయిలును నియమించినట్లు తెలిపారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ సభ్యులుగా కరిపె రాజు, రెహన్ అహ్మద్, ఇరుమల శంకర్, పంచరెడ్డి మురళి, యెండల ప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, సాయికృష్ణ, శనవాజ్‌ఖాన్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ సభ్యులుగా నరేష్‌నాయక్, బానోత్ ప్రేమ్‌దాస్, ఆర్మూర్ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీ సభ్యులుగా నవీన్‌రెడ్డి, మనోజ్‌రావు, మహ్మద్ అజాం, బోధన్ నియోజకవర్గ సభ్యులుగా మహేందర్‌రెడ్డి, ధీరజ్‌లను నియమించారు.

తండాల్లో కేంద్ర బృందం పర్యటన

మోపాల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మారుమూల గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధిపై కేంద్రం బృందం సందర్శించి వారి బాగోగులను తెలుసుకున్నారు. కేంద్రం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారా.. లేదా ఆరా తీశారని ముదక్‌పల్లి మాజీ ఎంపీటీసీ అను సంగ్య నాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని గుడితండా, శ్రీరాంనగర్ తండా, అమ్రాబాద్ తదితర గిరిజన తండాలను ఈ బృందం పర్యటించింది. కార్యక్రమంలో బృందం సభ్యులు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ వెంకటకుమార్, మోహన్ సింగ్ ఉన్నారు.

నిండుకుండలా ఎస్సారెస్పీ

మెండోర, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం నిలకడగా ఉందని ఎస్ఈ జగదీష్ తెలిపారు. ఎగువ నుంచి 9454 క్యూసెక్కుల వరద చేరుతోందని, ప్రాజెక్టు ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. సరస్వతి కాలువ ద్వారా 650, ఆవిరి రూపంలో 573, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం 1091అడుగుల(80టీఎంసీలు) వరకు నిల్వ ఉందన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు అందే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నేతలు

ఆర్మూర్‌టౌన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్‌లో అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందే వరకు తమ పోరాటం ఆగదని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవారం అన్నారు. బుధవారం పట్టణంలోని కుమార్‌నారయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజులక్రితం అంకాపూర్ గ్రామస్థులు తహసీల్దార్ ఆఫీస్ వద్ద నాలుగురోజులు రిలే నిరాహార దీక్ష చేశారని, ఈ విషయం గురించి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి విడ్డూరంగా మాట్లాడటం సమాజసం కాదని మండిపడ్డారు. ఎమ్మెల్యే అనుచరులు అక్రమాలకు పాల్పడ్డారని, వాటిని కప్పిపుచ్చుకొవడానికి అలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. కలెక్టర్‌కు రీసర్వే కోసం లేఖ రాయలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) సబ్‌డివిజన్ కార్యదర్శి కిషన్, రాజన్న, లింబాద్రి, పోశెట్టి, రఫీ, మహేందర్, రాజన్న తదితరులున్నారు.

బాల్య వివాహాలు చేస్తే చర్యలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

నవీపేట,నవంబరు12(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరపడం చట్టరీత్యా నేరమని ఇటువంటి చర్యలకు పాల్పడే వారికి చట్టపరమైన శిక్షలు ఉంటాయని తహసీల్దార్ వెంకట రమణ హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలకు 18, పురుషులకు 21సంవత్సరాల వయసు దాటిన తర్వాతనే వారికి వివాహం జరిపించాలన్నారు. ఎక్కడైన బాల్య వివాహలు జరుగుతున్నట్లు తెలిస్తే సంబంధిత సమాచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎస్ఐ తిరుపతి, బాలల పరిరక్షణ అధికారి గణేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకే షీ టీంలు


బాల్కొండలో షీ టీం పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ముప్కాల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం షీ టీంలు పనిచేస్తున్నాయని ఈవ్ టీజింగ్ చేస్తే షీ టీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్ల విగ్నేష్, సుమతి సూచించారు. బుధవారం బాల్కొండ మండల కేంద్రంలోని మైనారిటీ హై స్కూల్, కాలేజీలో సైబర్ క్రైమ్స్, మహిళ రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణ కోసం బస్టాండ్, ప్రధాన చౌరస్తాలు, జన సమీకరణ ప్రాంతాలు, కళాశాలల వద్ద షీ టీం నిరంతరం ఉంటుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 8712659795 నెంబర్‌కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఎవరైనా ఆన్‌లైన్‌ల ద్వారా మోసానికి గురైతే వెంటనే ట్రోల్ ఫ్రీ నెంబరు 1930కి సమాచారం అందించాలన్నారు. క్యూఆర్‌కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు.

వివాహిత అదృశ్యం

మాక్లూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుత్పతండాకు చెందిన పింకు అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పింకుకు డిచ్‌పల్లి మండలం వేస్లినగర్ గ్రామానికి చెందిన వ్యక్తితో కొన్నేళ్ల కిందట వివాహమైంది. 20 రోజుల క్రితం తల్లి ఊరైన గుత్ప తండాకు వచ్చారు. అత్తవారింటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలుదేరారు. ఇంత వరకు ఇంటికి చేరుకోకపోవడంతో పింకు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

పిట్లం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లను మండలకేంద్రంలో శివాజీచౌక్‌లో పట్టుకున్నట్లు ఎస్సై వెంకట్‌రావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని వెల్లడించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కోటగిరి,నవంబరు12(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామానికి చెందిన ఆనంద్ అనే వ్యక్తి ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్ఐ సునీల్ సెల్‌ఫోన్‌ను ఆనంద్‌కు అందజేశారు. ఆయన పోలీసులుకు ధన్యవాదాలు తెలిపారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

రెంజల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల ఇందిరమ్మ రాజ్యంతోనే సాధ్యమైందని, పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. బుధవారం మండలంలోని నీలా, బోర్గాం గ్రామాలలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎంపీడీవో కమలాకర్‌తో కలిసి పంపిణీ చేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని కొనియాడారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేదల సొంతింటి కలను నెరవేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంకే దక్కుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రఫీ హైమద్, పంచాయతీ కార్యదర్శులు సాయిలు, రాణి, యూత్ కాంగ్రెస్ బోధన్ అసెంబ్లీ అధ్యక్షులు కార్తీక్ యాదవ్, నాయకులు ఎంఎల్ రాజు, గంగాకిషన్, జావీదోద్దీన్, రాంచందర్ పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణకు అధికారులకు ఆహ్వానం


ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 18న జరిగె గిరి ప్రదక్షిణకు రావాలని అధికారులకు సిద్దులగుట్ట ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానించారు. కార్తీక బహుళ త్రయోదశి మాసశివరాత్రి రోజైన ఈనెల 18న సిద్ధేశ్వరుడు, సీతారామ లక్ష్మణ, ఆంజనేయులు, అయ్యప్ప ఉత్సవ విగ్రహాలతో ఊరేగింపు, రథోత్సవం, సప్తహారతి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ రాజును ఉత్సవకమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు బి.సుమన్, చరణ్‌రెడ్డి, బట్టు శంకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

బోధన్‌లో జాతీయ విద్యా దినోత్సవం

బోధన్,నవంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాండుఫారంలో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో బుధవారం మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ముఖ్య అతిథి, విజిలెన్స్ అధికారి మహ్మద్ జియాద్ అన్నారు.

అసలే చలికాలం.. ఆపై చన్నీటి స్నానం


మద్నూర్ బీసీ వసతిగృహంలో చన్నీటి స్నానాలు చేస్తున్న విద్యార్థులు

- వసతి గృహాలలో సౌకర్యాల లేమి..
- చన్నీటి స్నానాలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

మద్నూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతిగృహాల్లో చదివే విద్యార్థుల సౌకర్యాలపై ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఇంటిని మరిపించేలా సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. అసలే చలికాలం కావడం, ఎన్నడూ లేనంత చలి తీవ్రత ఉండటంతో తెల్లవారుజామున లేచి చన్నీళ్లతో స్నానాలు చేసేందుకు విద్యార్థులు గజగజ వణుకుతున్నారు. కనీస వసతుల కోసం ఏళ్ల తరబడి చూస్తూనే ఉన్నారు.

ఉమ్మడి మద్నూర్‌లో ఇదీ పరిస్థితి..

ఉమ్మడి మద్నూర్ మండలంలోని బీసీ వసతిగృహంతో పాటు కస్తూర్బా విద్యార్థినులకు చన్నీటి స్నానాలు తప్పడం లేదు. చలికాలంలో చన్నీటి స్నానం చేస్తే రోగాల బారిన పడతారన్న ఉద్దేశంతో ప్రభుత్వం కొన్ని వసతి గృహాలలో సోలార్ ప్యానల్‌లు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. కానీ మండల కేంద్రంలోని బీసీ వసతిగృహంలో ఇంతవరకు సోలార్ ప్యానల్ ఏర్పాటుచేయలేదు. కస్తూర్బా విద్యాలయంలో రూ.కోట్లు వెచ్చించి వేయి లీటర్ల సామర్థ్యంతో సోలార్‌వాటర్ హీటర్లను ఏర్పాటు చేశారు. కానీ 2018 నుంచి సౌరశక్తితో నడిచే హీటర్ పనిచేయక పోవడంతో విద్యార్థులకు చన్నీటి స్నానాలు తప్పడం లేదు.

మొరాయిస్తున్న హీటర్లు

కస్తూర్బాలో 2017లో పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సౌర శక్తితో నడిచే హీటర్లను అమర్చారు. అమ ర్చిన ఏడాది నుంచి మొరాయిస్తుందని, ఆంధ్రజ్యోతి పరిశీలనలో తేలింది. దీంతో విద్యార్థులు చన్నీటితోనే స్నానం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. తెల్లవారుజామున చలి అధికంగా ఉండటంతో కొంతమంది విద్యార్థులు మధ్యాహ్నం స్నానాలు చేస్తున్నారు. బీసీ వసతి గృహంతో పాటు కస్తూర్బా విద్యాలయంలో వేడినీళ్ల గీజర్ లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వసతి గృహంలో గీజర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


వేడినీటిని అందించాలని కోరుతున్న విద్యార్థులు

గోపాల మిత్రలకు వేతన వెతలు


పశువైద్య శిబిరంలో పాల్గొన్న గోపాలమిత్రలు

- 8 నెలలుగా అందని వేతనాలు
- దయనీయ స్థితిలో గోపాలమిత్రలు
- ఉమ్మడి జిల్లాలో 121 మంది విధులు

సదాశివనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్థక శాఖలో దీర్ఘకాలికంగా వివిధ రకాల సేవలందిస్తున్న గోపాల మిత్రల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వ పశువైద్య సిబ్బందితో సమానంగా పనిచేస్తున్నప్పటికీ ఉద్యోగ భద్రత కరువైంది. వారికి ఇచ్చేది అరకొర వేతనాలే అయినా.. అవికూడా 8 నెలలుగా అందడం లేదు. దీంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు తప్పట్లేదు.

ఉమ్మడి జిల్లాల్లో 121 మంది

పాడి, పశు సంపదను వృద్ధి చేయాలనే లక్ష్యంతో జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం కింద ప్రభుత్వం గోపాలమిత్రలను నియమించింది. వీరి పర్యవేక్షన అంతా రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ చూసుకుంటోంది. ప్రస్తుతం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 121 మంది గోపాలమిత్రలు విధులు నిర్వహిస్తున్నారు.

గోపాలమిత్రల నియామక లక్ష్యం ఇలా...

రైతుల ఇళ్లకు వెళ్లి పశువులకు కృత్రిమ గర్భధారణ, టీకాలు, నట్టల నివారణ మందులు వేయడం, గర్భకోశ వ్యాధులు, జబ్బవాపు, గొంతు వాపు నివారణ టీకాలు వేయడం ప్రధాన లక్ష్యం. అలాగే పశుసంపద అభివృద్ధికి, సంకరజాతి గేదెలల ఉత్పత్తికి, పాడి అభివృద్ధికి, పశుగ్రాసాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో హెల్త్, డీ వార్మింగ్ క్యాంపులు నిర్వహిస్తూ టీకాలు, నట్టల నివారణ మందులు వేస్తున్నారు.

ఉద్యోగ భద్రత లేక ఇబ్బందులు..

గోపాల మిత్రలకు ఉద్యోగ క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత ఇప్పటికీ జరగలేదు. తెలంగాణ ఏర్పడ్డాక రూ.3500ల నుంచి రూ.8500లకు వేతనం పెంచింది. 2022లో మళ్లీ రూ.11,500లకు పెంచారు. ఇంతరవరకు బాగానే ఉన్న గత 8 నెలలుగా వేతనాలు విడుదల కాకపోవడం గమనార్హం.

25 ఏళ్లుగా సేవలు అందిస్తున్నాం..



8 నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. ఉద్యోగ క్రమబద్ధీకరణతో పాటు ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించాలి. 25 ఏళ్లుగా సేవలు అందిస్తున్న తమకు రూ.24 వేల వేతనమివ్వాలి. విధి నిర్వహణలో చనిపో యిన వారి కుటుంబీకులకు కారుణ్య నియా మకం ద్వారా ఉద్యోగం కల్పించాలి. రూ.10 లక్షల మెడికల్ ఇన్సూరెన్స్, ప్రమాద బీమా రూ.6లక్షలుగా ప్రకటించాలి.

- బ్రహ్మం, గోపాలమిత్ర సంఘం జిల్లాధ్యక్షుడు

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ముప్కాల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బోర్గాం (పి) జడ్పీ ఉన్నత పాఠశాలలో టీ-శాట్, రాష్ట్ర గెజిటెట్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఈ పోటీల్లో బాల్కొండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొనగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని పి.సంజన జిల్లా స్థాయిలో క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతిని సాధించింది. సాయిశివాని ఉపన్యాస పోటీలలో బాలవక్తగా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన వేల్పూర్ శ్రీనివాస్, ఉపన్యాస పోటీలకు శిక్షణ ఇచ్చిన కవితా రాణిని, విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు సాధించేలా కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాతో అందెశ్రీకి విడదీయలేని బంధం


బోర్గాం(కె)లో అందెశ్రీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మాక్లూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ అందెశ్రీకి నిజామాబాద్ జిల్లాతో విడదీయలేని బంధం ఉందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా నాయకులు దేశెట్టి సాయిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బోర్గాం(కె) గ్రామంలో అందెశ్రీ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని అమ్రాద్ గ్రామంలో ఒక గురువు వద్ద ఉంటూ అదే గ్రామంలో మేస్త్రీ పనిచేసి కుటుంబాన్ని పోషించుకున్న కష్టజీవి అందెశ్రీ అని అన్నారు. పీడిత ప్రజల కోసం తాను చదవకపోయినా ప్రకృతిని, సమాజాన్ని నమ్ముకుని అనేక పాటలను రాసిన గొప్ప కళాకారులు అని గుర్తుచేశారు. ప్రజాసంఘాల నాయ కులు శంకర్, గంగాధర్, సరోజన, భూమన్న, పుష్ప, బాలమణి, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల వివరాలు యూడైస్‌లో నమోదుచేయాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నవీపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి వివరాలను యూడైస్ పోర్టల్‌లో విధిగా నమోదు చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని దర్యాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, భవిత కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. యూడైస్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాల నమోదు గురించి ఆరా తీశారు. బర్త్ సర్టిఫికెట్ లేకపోవడం వల్ల కొంతమంది విద్యార్థుల వివరాలను నమోదు చేయలేదని పాఠశాల హెచ్ఎం హన్మంత్ రావు తెలుపగా కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. బర్త్ సర్టిఫికెట్ లేని విద్యార్థులకు వాటిని ఇప్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అవసరమైన వారి ఆధార్ వివరాలను సైతం అప్‌డేషన్ చేయించాలని ఆదేశించారు. విద్యార్థులకు బర్త్ సర్టిఫికేట్‌లు జారీ చేయాలని తహసీల్దార్ వెంకట రమణకు సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు ముఖ గుర్తింపు విధానం ద్వారానే వందశాతం అమలుచేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ నిర్వహణను మెరుగుపర్చాలని, నిరుపయోగంగా ఉన్న పాత గదులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించారు. భవిత కేంద్రాల నిర్మాణాలు, మరమ్మతుల కోసం అవసరమైతే జిల్లా యంత్రాంగం ద్వారా అదనపు నిధులను సమకూరుస్తామని అన్నారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, తహసీల్దార్ వెంకట రమణ, ఎంపీడీవో నాగనాథ్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు రవి, ఉదయ్ కిరణ్, భవిత కేంద్రాల జిల్లా ఇన్‌చార్జి ప్రకాష్ తదితరులున్నారు.


ఫోన్‌లో విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న కలెక్టర్

హామీలను వెంటనే అమలుచేయాలి

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారం పథకాన్ని వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వేల్పూర్‌లోని ఆయన నివాసంలో వేల్పూర్, భీమ్‌గల్, ఏర్గట్ల మండలాలకు చెందిన 223 కల్యాణలక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తులు మంజూరు చేస్తూ సంతకాలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలన్నారు. కొత్తగా చెక్కు లు మంజూరయ్యే లబ్ధిదారులతో పాటు కాంగ్రె స్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు చెక్కులు అందుకున్న వారందరికీ తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వేల్పూర్‌కు చెందిన గౌరాయి నారాయణ, ఆర్టీసీ డ్రైవర్ శ్యాం, వెంకటాపూర్ బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు నీరడి రాజేశ్వర్ సోదరుడు బొర్రయ్య ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి బుధవారం ఆయా కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. మృతుడు శ్యాం సతీమణి విమలకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే వేల్పూర్‌కు చెందిన ఫొటోస్టూడియో యజమాని నీరటి అశోక్ ఇటీవల పక్షవాతం బారిన పడగా.. ఆయనను పరామర్శించారు.


దరఖాస్తులపై సంతకాలు చేస్తున్న ఎమ్మెల్యే

మద్యం తాగి పట్టుబడితే రూ.10వేల జరిమానా, జైలు

- పోలీసు కమిషనర్ సాయిచైతన్య

సుభాష్‌నగర్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో ఇకనుంచి మోటార్ వెహికిల్ సవరణ చట్టం అమలు చేస్తున్నట్లు పోలీసు కమిషనర్ సాయిచైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 వెహికిల్ సవరణ చట్టం ప్రకారం మద్యం తాగి వాహనం నడిపి మొదటిసారి పట్టుబడిన వారికి రూ.10వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష, జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తారని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 2వ సారి పట్టుబడి వారికి రూ.15వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష లేదా జరిమానాతో పాటు జైలు విధించనున్నట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ రద్దు లేదా సస్పెండ్ కూడా చేయవచ్చని అన్నారు. మద్యం తాగి రోడ్డుమీద ప్రమాదం చేసి ఎదుటి వారు మరణిస్తే ఐపిసి సెక్షన్ 105 బీఎన్ఎస్ (304)2 కింద కేసు నమోదు చేయబడునని తెలిపారు. ఈ సెక్షన్ ప్రకారం 10 సంవత్సరాల వరకు జైలు, జరిమానా, జరిమానాతో పాటు జైలు విధించబడునని తెలిపారు. తాగి వాహనం నడిపి ఎదుటి వారిని గాయాలకు గురైనట్లు చేస్తే 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష, జైలు శిక్షతో పాటు జరిమానా విధించవచ్చని తెలిపారు. పోలీసు బ్రీత్ అనలైజర్ ద్వారా పరిక్షించవచ్చని పరిక్షకు నిరాకరించిన అదే సెక్షన్ కింద శిక్షించవచ్చన్నారు. ప్రతి వాహనదారుడు భద్రత నియమాలు తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు.

వరికోత మిషన్‌లను అందుబాటులో ఉంచాలి


నవీపేట, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రైతులకు వరికోత మిషన్‌లను అందుబాటులో ఉంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్ కోరారు. బుధవారం మండలంలోని మిట్టాపూర్, ధర్మారం, మహంతంలలో సీపీఎం నాయకులు పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

న్యాయం కోసం మహిళ దీక్ష


దీక్ష చేస్తున్న మహిళ

సదాశివనగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ స్నేహ మహిళా సంఘం సభ్యులకు తెలియకుండా ఫోర్జరీ సంతకాలు పెట్టి లోన్ తీసుకున్నారని ఆరోపిస్తూ సంఘం సభ్యురాలు, మాజీ ఎంపీటీసీ త్రివేణి మహిళా సంఘం ఎదుట బుధవారం దీక్ష చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్నేహా మహిళా సంఘం సభ్యులకు తెలియకుండా వీవోఏ వరలక్ష్మీ, గతంలో పనిచేసిన అధికారి లింగం తమ సంతకాలను ఫోర్జరీ చేసి బ్యాంకు నుంచి రూ.15లక్షల లోన్ తీసుకున్నట్లు ఆరోపించింది. ఈ విషయమై కలెక్టర్, పీడీకి సైతం ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తనకు న్యాయం జరిగే వరకు మహిళా సంఘం ఎదుట నిరసన దీక్ష చేస్తానని తెలిపారు. సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి లోన్ తీసుకున్నవారిపై వెంటనే చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టీఎన్‌జీవోస్‌లో డీపీవో సిబ్బంది చేరిక


సభ్యత్వం అందిస్తున్న టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

కామారెడ్డిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవోస్‌లో జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది బుధవారం చేరారు. ఈ మేరకు వారికి టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి సభ్యత్వాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 80 సంవత్సరాల చరిత్ర కలిగిన ఉద్యోగుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక సంఘం టీఎన్‌జీవోస్ అని అన్నారు. పెండింగ్ బిల్లులు, పీఆర్‌సీ, డీఏలు, ఆరోగ్యకార్డులు, వివిధ సమస్యలపై పోరాడి పరిష్కారానికి టీఎన్‌జీవోస్ మాత్రమే కృషిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా సహాధ్యక్షుడు చక్రధర్, జిల్లా ఉపాధ్యక్షుడు లక్షణ్, రాజేశ్వర్, సంయుక్త కార్యదర్శి రమణకుమార్, జిల్లా కార్యవర్గసభ్యుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలకు స్విమ్మింగ్ పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు


సుభాష్‌నగర్, నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అంతర్ పాఠశాలల స్విమ్మింగ్ పోటీలను బుధవారం నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఉమ్మడి జిల్లాల అండర్-14, అండర్-17 బాలబాలికల పోటీలు నిర్వహించారు. ఇందులో 50మీ, 100మీ, 200మీ, 400మీలు, ఫ్రిస్టైల్, బట్టర్‌ఫ్లై విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి తెలిపారు. ఇందులో ప్రతిభకనబర్చిన అండర్-17 క్రీడాకారులను ఈ నెల 13 నుంచి 15 వరకు వికారాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు వివరించారు. అండర్-14 క్రీడాకారులను ఈ నెల 17 నుంచి 19 వరకు పెద్దపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఈ ఎంపికల్లో ఫిజికల్ డైరెక్టర్ ప్రతిభ, స్విమ్మింగ్ కోచ్ ఫారుక్, తదితరులు పాల్గొన్నారు.

రేణుకానగర్ కాలనీ బోర్డు ఏర్పాటు


కాలనీ బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంజారా భవన్ వద్ద ఏర్పడిన నూతన కాలనీకి స్థానికులు బుధవారం రేణుక నగర్‌గా నామకరణం చేసి బోర్డు ఏర్పాటుచేశారు. తమ కాలనీ పేరు అధికారులు నమోదు చేసుకోవాలని కోరారు. సతీష్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, సాయిలు, రమేశ్, మధుసూతన్‌రెడ్డి, మధు, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

టీకాతో వ్యాధులు దూరమిక



- గాలికుంటు నివారణకు టీకాల అందజేత
- రేపటితో ముగియనున్న కార్యక్రమం
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన
- జిల్లాలో 5.55 లక్షలకు పైగా పశువులు
- ఏడాదికి రెండు సార్లు టీకాలు అందిస్తున్న ప్రభుత్వం

కామారెడ్డిటౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది వివిధ రకాల వ్యాధులతో పశువులు, జీవాలు వందల సంఖ్యలో మృత్యువాత పడుతుండటంతో పోషకులు, పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. పశువుల మరణాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగా ప్రతి ఏడాది పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తుంది. కాగా కామారెడ్డి జిల్లాలో ప్రారంభమైన ఈ టీకాల కార్యక్రమం ఈ నెల 14 వరకు కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 5.55లక్షల పశువులు ఉన్నాయి. ఇందులో తెల్లపశువులు 50 వేలు, గేదెలు 80 వేలు, గొర్రెలు 3 లక్షల 30వేలు, మేకలు లక్ష 3వేలకుపైగా ఉన్నాయి. పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు అవగాహన కలిగి ఉంటూ సకాలంలో నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖాధికారులు సూచిస్తున్నారు.

ఏడాదికి రెండుసార్లు..

వ్యవసాయానికి అను బంధంగా పాడిపరిశ్రమతో రైతులు ఆర్థికంగా బలపడుతున్న నేపథ్యంలో వారు నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏటా 2 సార్లు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం చేపడతారు. కాగా జిల్లాలోని 52 పశుసంవర్ధకశాఖ ఆసుపత్రులలో, సబ్ సెంటర్‌లలో కార్యక్రమం చేపడుతున్నారు.

గాలికుంటు వ్యాధి లక్షణాలు ఇలా..

గాలికుంటు వ్యాధి సూక్ష్మక్రిములతో వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధిని ఫుట్‌అండ్ మౌత్ డీసీజ్‌గా పేర్కొంటారు. గాలిలో తేమశాతం అధికంగా ఉన్నప్పుడు వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుంది. వ్యాధిసోకిన సమయంలో గేదెలు, ఆవులు 24 గంటలలోగా బక్కచిక్కి అల్సర్ బారినపడడంతో పాటు ఆడ పశువుల్లో గర్భం విఫలమవుతుంది. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వరం ఎక్కువగా ఉంటుంది. నోరు,మూతి,కాళ్లు, గిట్టలపై పుండ్లు, బొబ్బలు రావడం, నోటినుంచి విపరీతంగా నురగరావడం లాంటి వ్యాధి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధిసోకిన పశువులు ముడుచుకుని పడుకుంటాయి. మేత, నీళ్లకు దూరంగా ఉంటాయి. వ్యాధినిరోధక శక్తి తగ్గడంతో పశువులు, దూడలు చనిపోయే ప్రమాదం ఉంటుంది. పశువుల అంత స్రావాల వల్ల వ్యాధి మిగతా పశువులకు వ్యాపించే అవకాశం ఉంటుంది. వ్యాధికారక క్రిమి ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి గాలిద్వారా వ్యాప్తి చెందుతుంది. గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఒకచోటు నుంచి మరోచోటుకు త్వరగా వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి ఎక్కువగా అక్టోబరు, నవంబరు, మార్చి, ఏప్రిల్ నెలల్లో సోకుతుంది. ఏటా ఈ నెలల్లో వ్యాధి నివారణకు పశుసంవర్ధకశాఖ పశువులకు టీకాలు వేస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువుల్లో ఉత్పాదకశక్తి తగ్గిపోతుంది. జ్వరతీవ్రత పెరిగి పశువులు నిరసిస్తాయి. ఫలితంగా పాడిరైతులు ఆర్థికంగా నష్టపోతారు.

జాగ్రత్తలు అవసరం..

అయితే అధికారులు నిత్యం ఉదయం 6గంటల నుంచి 11 గంటలవరకు గ్రామాల్లోకి వెళ్లి టీకాలు వేస్తున్నారు. ప్రాణాంతక వ్యాధి కావడంతో చిన్నపాటి అలసత్వం వహించినా పశువులు మృత్యువాత చెందుతాయి. వ్యాధి బారినపడిన పశువులను ఇతర వాటికి దూరంగా ఉంచాలి. ఎప్పటికప్పుడు పశువుల పాకలను శుభ్రం చేయడంతో పాటు క్రిమికీటకాల నివారణకు చర్యలు తీసుకోవాలి. వ్యాధి సోకిన గేదె, ఆవు నుంచి తీసిన పాలను 100 డిగ్రీల సెల్సియస్ వద్ద వేడిచేశాకే తాగాలి. పశువు చనిపోతే గోతిలో వేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించాలి


లింగంపేటలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి షేక్ సలామ్

లింగంపేట, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : అర్ధ మాసిక పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులపై లెక్చరర్లు ప్రత్యేక శ్రద్ధపెట్టి వచ్చే ఫిబ్రవరిలో జరిగే సంవత్సర పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా చూడాలని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలామ్ అన్నారు. ఆయన బుధవారం లింగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న అర్ధమాసిక పరీక్షలను పరిశీలించారు. విద్యార్థులు కాపీచేయకుండా చూడాలని ఆయన అధ్యాపకులను ఆదేశించారు. పరీక్షలు పూర్తి కాగానే ఆన్సర్ షీట్‌లు మూల్యాంకనం చేసి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ముఖ్యమైన ప్రశ్న, జవాబులను వారికి ఇచ్చి 90రోజుల ప్రణాళికను అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ నెల 14లోపు పరీక్ష ఫీజులను చెల్లించేలా విద్యార్థులకు తెలియజేయాలని తెలిపారు. ఈ నెల 14 తరువాత రూ.100 ఫైన్‌తో ఫీజు కట్టాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేందర్, లెక్చరర్లు దుర్గయ్య, శివ, రాజయ్య, స్వామిగౌడ్, అంజయ్య, నాగు, ధర్‌సింగ్, షైమద్, శ్రీలత, సంధ్యా, సిబ్బంది అనంద్‌రెడ్డి, అభినవ్, నాగయ్యలతో పాటు విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

క్యాసంపల్లిలో పశువైద్య శిబిరం



గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి రవికిరణ్

కామారెడ్డిరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించినట్లు పశువైద్యాధికారి రవికిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 70 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామన్నారు. గర్భంతో ఉన్న 13 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించామని చెప్పారు. పశువులు గర్భం దాల్చిన సమయంలో వైద్యపరీక్షలు చేయిస్తూ వైద్యాధికారుల సూచనలను తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. పాలకేంద్రం అధ్యక్షుడు రాజిరెడ్డి, డైరెక్టర్లు లింగారెడ్డి, భూపాల్‌రెడ్డి, తోట భాస్కర్, లింగారెడ్డి, గోపాలమిత్రలు శ్రీనివాస్, బాలు, బాబు, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్యాణి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులు మంజూరు కావడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తూ సొంతింటి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కృషితో తమలాంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా సొంతింటి కల నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సంజీవులు, సీనియర్ నాయకులు మైదపు శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైన్స్‌కు కొలతలు నిర్వహించిన ఎక్సైజ్ అధికారులు



నూతన వైన్‌షాపు కోసం కొలతలు తీస్తున్న ఎక్సైజ్ అధికారులు

లింగంపేట, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని భీమాగౌడ్ కాంప్లెక్స్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న నూతన వైన్‌షాపుపై కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎక్సైజ్ అధికారులు కొలతలు నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న వైన్‌షాపు బడికి, గుడికి దగ్గరగా ఉందని నిబంధనలకు విరుద్ధంగా వైన్‌షాపును ఏర్పాటు చేస్తున్నారని కాలనీవాసులు తహసీల్దార్, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఎక్సైజ్ అధికారులు షాపు ఏర్పాటు చేస్తున్న స్థలం నుంచి గుడివరకు కొలతలు చేశారు. నిబంధనల ప్రకారం 100 మీటర్లకు దూరంగా ఉందని వారు తెలిపారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నిజాంసాగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ-అన్నాసాగర్-పిట్లం రహదారిపై బాన్సువాడ, నిజాంసాగర్ డివిజన్ పరిధిలోని పోలీసులు బుధవారం వాహనాల ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ధృవీకరణ పత్రాలతో పాటుగా పెండింగ్ చాలన్లు పోలీసులు తనిఖీ చేసి డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని, వాహనాలు నడిపే వాహనదారులు తగిన ధృవీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన హాస్టల్ వెల్ఫేర్ అధికారి



బాధ్యతలు స్వీకరిస్తున్న వెల్ఫేర్ అధికారి విఠల్

నిజాంసాగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చంపేటలో గల సాంఘిక సంక్షేమ సమీకృత హాస్టల్ వెల్ఫేర్ అధికారిగా విఠల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ సమీకృత హాస్టల్‌లో విద్యార్థులకు సరైన వసతులు ఉండేలా కృషి చేస్తానని, హాస్టల్‌ను జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని, విద్యార్థులకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలి



అంగన్‌వాడీ సెంటర్‌లో హాజరును పరిశీలిస్తున్న సీడీపీవో

దోమకొండ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించాలని పిల్లలు ప్రతిరోజు సెంటర్‌కు వచ్చేలా చూడాలని సీడీపీవో రోచిష్మా అన్నారు. బుధవారం మండలంలోని సీతారాంపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సెంటర్‌లో ఉన్న పిల్లల హాజరు నమోదు వివరాలు, బరువు తదితర అంశాలను టీచర్ లక్ష్మీనర్సవ్వను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గార్డెన్ పెంపకం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలు సెంటర్‌కు సమయానుప్రకారం వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయమ్మ హేమలత పాల్గొన్నారు.

కోత మిషన్ల కొరత

- వరికోతలో ఆలస్యం
- మహమ్మద్‌నగర్‌లో రైతులకు ఇబ్బందులు



తారిపోతున్న పంటను పరిశీలిస్తున్న రైతు

మహమ్మద్‌నగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండలంలోని పలుగ్రామాల్లో వరికోత మిషన్ల కొరత ఏర్పడింది. దీంతో సీజన్‌లో వరికోత పనులు చాలా ఆలస్యంగా కొనసాగుతున్నాయి. మండలవ్యాప్తంగా ఉన్న వరిపంట చేతికి అందే స్థాయికి చేరినా వరికోత మిషన్లు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహమ్మద్‌నగర్ మండలకేంద్రంతో పాటుగా మండలంలోని బూర్గుల్, నర్వ, తూంకీపల్లి, గాలాపూర్, కోమలంచ, ముగ్దంపూర్, సింగీతం, షేర్కాన్‌పల్లి వంటి గ్రామాల్లో విస్తారంగా ఉన్న వరి పంట కోతకు వచ్చినా కోతమిషన్లు అందుబాటులో లేకపోవడంతో పంటలు తారిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు మిషన్లు దొరకకా, ప్రతిరోజు వర్ష భయంతో రాత్రి, పగళ్లు నిద్రాహారాలు మాని మిషన్ల కోసం వెతకాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక వేళ వర్షం పడినా గాలులు వీచినా పంట నష్టపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేపరిస్థితి ఉంటే ధాన్యం నాణ్యత తగ్గిపోతుందని వాపోతున్నారు. కోత మిషన్ల కొరత ఉండడంతో కొందరు మిషన్ల యాజమానులు మిషన్ల ధరలను అమాంతం పెంచేశారని, గంటకు రూ.3500లు డిమాండ్ చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రైతుల పరిస్థితి అయోమయంగా ఉందని పంటలు చేతికి వచ్చినా కోత మిషన్లు లేకపోవడం, ఒకటి రెండు అందుబాటులో ఉన్నా వాటి ధరలను యాజమానులు అమాంతం పెంచడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారు.

ఉల్లాస్.. ఉత్తదేనా?

(5వ పేజీ తరువాయి)

వాలంటీర్లను నియమించినట్లు తెలిపారు. కానీ ఎక్కడా కూడా మహిళా సంఘాల్లో నిరక్షరాస్యులకు విద్యా బోధన జరుగుతున్న తీరు కనిపించడం లేదని మహిళా సంఘాల్లోని పలువురు నిరక్షరాస్యుల సభ్యులు వాపోతున్నారు.

పల్లెల్లోకి చేరని ఉల్లాస్ పుస్తకాలు..

పల్లెల్లో నిర్వహిస్తున్న ఉల్లాస్ కార్యక్రమంపై ఏ మాత్రం అవగాహన లేకపోవడంపై మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామని చెప్పినా ఇప్పటి వరకు గ్రామాల్లో వాలంటీరులు లేరు. పుస్తకాలు లేవు అని మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారు. పలు మహిళా సంఘాల సభ్యులకు ఉల్లాస్‌పై అవగాహన కూడా లేకపోవడం ప్రాజెక్టు నిర్వహణ సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. అధికారులు అక్కడక్కడా కార్యక్రమాలు చేస్తూ తూతూ మంత్రంగా చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

ఎంఈవో కార్యాలయంలో వృథాగా పడి ఉన్న ఉల్లాస్ పుస్తకాలు

మండలంలో చేపడుతున్న ఉల్లాస్ కార్యక్రమానికి కావాల్సిన పుస్తకాలు కామారెడ్డి మండల సమాఖ్య భవనం పక్కనే ఉన్న ఎంఈవో కార్యాలయంలో వృథాగా పడి ఉన్నాయి. ఈ పుస్తకాలు వచ్చి నెలలు గడుస్తున్నా నిరక్షరాస్యుల సభ్యులకు ఇవ్వడం లేదు. అంతే కాకుండా మండలంలోని పలువురు నిరక్షరాస్యులకు శిక్షణ తరగతులు నిర్వహించిన దాఖలాలు లేవని సభ్యులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులను వివరణ కోరగా ఇప్పటి వరకు పుస్తకాలు రాలేవు.. పై అధికారులను అడుగుతున్నాం.. వచ్చిన తర్వాత నిరక్షరాస్యులకు పుస్తకాలు అందజేస్తామని చెప్పడంపై అధికారుల తీరు ఎలా ఉందో తెలుస్తోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఉల్లాస్ పథకం ద్వారా వచ్చిన పుస్తకాలను నిరక్షరాస్యులకు అందించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉంది.

మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

(5వ పేజీ తరువాయి)

కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో బుధవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు లారీల్లో రైస్ మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం తేమ శాతం ఇప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. ఇప్పటి వరకు ఎంత వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారని వివరాలు సెంటర్ ఇన్‌చార్జీలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత మండల అధికారులు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను అందిస్తూ ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలకు రూ.2,389లు, సాధారణ రకానికి రూ.2,369ల చొప్పున కనీస మద్దతు ధర చెల్లించడంతో పాటు సన్న రకానికి అదనంగా రూ.500లు చొప్పున బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి వెంకటేశ్వర్లు, డీఎం. శ్రీకాంత్, డీఏవో మోహన్‌రెడ్డి, ఏడీఏ అపర్ణ, ఏఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మార్వో జనార్దన్, ఆర్ఐ నర్సింహారెడ్డి, సొసైటీ డైరెక్టర్ రాంరెడ్డి, సెక్రెటరీ సతీష్, రైతులు ద్యాప హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలి

- డీఆర్‌డీఏ పీడీ సురేందర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సురేందర్

కామారెడ్డిటౌన్,నవంబరు 12(ఆంధ్రజ్యోతి):మహిళా సమాఖ్య సభ్యులు సమావేశాలను సక్రమంగా నిర్వహించి, నిబంధనలు తప్పకుండా పాటించాలని డీఆర్‌డీఏ పీడీ సురేందర్ అన్నారు. బుధవారం కామారెడ్డి మహిళా సమాఖ్యలో సీఆర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండల సమాఖ్య, గ్రామ సంఘాలు, చిన్న సంఘాలు ఉన్నత గ్రేడ్‌లో కొనసాగేలా కృషిచేయాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలన్నారు. సభ్యులు బ్యాంకులు, స్త్రీనిధి, గ్రామసంఘాల ద్వారా తీసుకున్న రుణాలను జీవనోపాధుల అభివృద్ధికి వినియోగించుకోవాలని, నూతన జీవనోపాధులపై శిక్షణ తీసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు. మహిళలు ఉత్పత్తి చేసే ప్రతి వస్తువుకు ప్రత్యేకమైన బ్రాండింగ్ రూపొందించుకోవాలని, మార్కెట్‌లో నిలదొక్కుకునే ఉత్పత్తులను సృష్టించాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాలు, ప్యాడి సెంటర్లు, సోలార్, పెట్రోల్ బంకులు, సూపర్‌మార్కెట్లు, పెరటి కోళ్ల పెంపకం వంటి వ్యాపారాలను మహిళలే నిర్వహించగలరని తెలిపారు. ప్రతి సభ్యురాలు శ్రద్ధ వహించి, ఇందిరమ్మ ఇండ్లను సద్వినియోగం చేసుకుని స్వగృహ నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీఎం శ్రీనివాస్ , జిల్లా సమాఖ్య పాలకవర్గ సభ్యులు, ఏపీఎంలు, మండల సమాఖ్య, గ్రామ సమాఖ్య పాలకవర్గ సభ్యులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

మాచారెడ్డి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 1 నుంచి 3వరకు జరిగిన మండలస్థాయి క్రీడాపోటీల్లో సోమారంపేట పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్స్‌గా నిలవడం అభినందనీయమని మాచారెడ్డి ఎంఈవో సురభి దేవేందర్ అన్నారు. బుధవారం క్రీడల్లో పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సోమారంపేట విద్యార్థులు అథ్లెటిక్స్‌లో మూడుబహుమతులు, ఖోఖో, కబడ్డీలో ఐదుబహుమతులను సాధించి సత్తాచాటారని అన్నారు. ఈ మేరకు క్రీడల్లో పాటుగా సాంస్కృతి కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సురభాస్కర్, పీఈటీ సంధ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లలో కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

ఉంది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 1.70 లక్షల క్వింటాళ్లలో సోయా కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే రైతులు పంటను నూర్పుడి చేసి సోయాను మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 2 వేల క్వింటాళ్ల సోయాబీన్‌ను కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

మట్టిపెళ్లలు ఉన్నాయంటూ తిరస్కరణ

జిల్లాలో సోయా వేల ఎకరాల్లోనే సాగుచేశారు. ఇప్పటికే పంటను కోసి రైతులు నూర్పిడి చేస్తూ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలిస్తున్నారు. సోయా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. రైతులు కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డులకు సోయాను పెద్ద మొత్తంలో తరలించారు. కేంద్రాల్లో కుప్పలు తెప్పలుగా సోయా ఉంది. అయితే సోయాలో పెద్దమొత్తంలో మట్టి పెళ్లలు ఉంటుండంతో నాఫెడ్ క్వాలిటీసెల్ అధికారులు తిరస్కరిస్తున్నారు. ఇప్పటికే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల్లో ఆయా రైతుల నుంచి సోయా కొనుగోలు చేసినప్పటికీ నాఫెడ్‌కు చెందిన క్వాలిటీ కంట్రోల్ సెల్ అధికారులు కేంద్రాల్లోని సోయాను పరిశీలిస్తున్నారు. అయితే కొనుగోలు చేసిన సోయాలో మట్టి పెళ్లలు ఉండడంతో క్వాలిటీసెల్ అధికారులు తిరస్కరిస్తున్నారు. దీంతో కేంద్రాల్లో సోయా కొనుగోళ్లు నిలిచిపోతున్నాయి. రైతులు కొనుగోలు చేయాలంటూ ఆందోళనకు దిగుతున్నారు. బుధవారం బిచ్కుంద మార్కెట్ యార్డ్‌లో నిబంధనలు సడలించి సోయాను కొనుగోలు చేయాలంటూ రైతులు ధర్నా చేపట్టారు.

నిబంధనల కొర్రీలు

ఈ వర్షాకాలం సీజన్‌లో చాలా మంది రైతులు పత్తి, మొక్కజొన్న నుంచి సోయా పంటవైపు మొగ్గు చూపారు. దీంతో 80 వేల ఎకరాల్లో సోయా పంట సాగైంది. భారీ వర్షాలు, వరదల కారణంగా సోయా దిగుబడులు అమాంతంగా పడిపోయి రైతులు నష్టాన్ని చవి చూస్తున్నారు. చేతికి వచ్చిన కాస్తోకూస్తో పంటనైన కేంద్రాల్లో అమ్ముకుందామంటే నిబంధనలు అడ్డువస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త కొత్త నిబంధనలను కొనుగోళ్లలో విధిస్తున్నారంటూ రైతులు మండిపడుతున్నారు. మట్టి పెళ్లలు ఉన్నాయంటూ, పంట నాణ్యతగా లేదంటూ కొనుగోలు చేసిన సోయాను తిరస్కరిస్తున్నారని, తేమ శాతం లేదంటూ కొర్రీలు విధిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎకరాకు 7.65 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అయితే కేంద్రాల్లో మాయిశ్చర్, పరిమితి కొనుగోలు, నాణ్యమైన పంట కొనుగోలు చేస్తేనే ప్రభుత్వం మద్దతు ధర రూ.5,328ల లభించనుంది. ఈ నిబంధనలతో రైతులు పంటను కేంద్రాల్లో అమ్మలేకపోతున్నారు. నిబంధనలను సడలించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కేజీబీవీని పరిశీలించిన డీఈవో

రాజంపేట,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను బుధవారం డీఈవో రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థుల కోసం నిర్వహించే ప్రత్యేక తరగతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు ప్రణాళిక, తరగతి గది బోధన రికార్డులను పరిశీలించారు. తరగతి గదిలో ప్రత్యక్షంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత సాధించేలా విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పునఃనిర్మాణానికి ఆర్థికసాయం



హెచ్‌ఎంకు బాండ్‌ను అందజేస్తున్న దృశ్యం

దోమకొండ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల పునఃనిర్మాణానికి కోటి రూపాయల విరాళాన్ని దాత పబ్బ విజయ్‌కుమార్ బుధవారం హెచ్‌ఎం రాధాలక్ష్మికి బాండ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలకు తన తల్లిదండ్రులైన పబ్బరుక్కమ్మ-బలరామయ్య పేరున మార్చాలని, అదే విధంగా పాఠశాల నిర్మాణాన్ని చేపడతానని బాండ్‌లో తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాపురెడ్డి, శ్రీనివాసులు శర్మ, నిర్మల, బాలకిషన్, గ్రామస్తులు పున్నలక్ష్మణ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కళాశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం

ఎల్లారెడ్డిరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల, మోడల్ కళాశాలను ఇంటర్మీడియట్ బోర్డ్ జిల్లా నోడల్ అధికారి షేక్‌సలాం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతిరోజు విద్యార్థులకు స్టడీఅవర్స్ నిర్వహించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకశ్రద్ధ వహించాలని చెప్పారు. విద్యార్థులతో ముచ్చటించి సెలబస్ షెడ్యూల్ గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మనోధైర్యంతో పరీక్షలు రాయాలని, ప్రణాళిక బద్ధంగా చదివి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, గాంధీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో జాతీయస్థాయికి ఎంపిక



బాక్సింగ్‌లో పతకం సాధించిన స్వీజ

బాన్సువాడరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని బోర్లం గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ స్వీజ ఎస్‌జీఎఫ్‌లో అండర్-17 50 కేజీల విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ సుప్రియ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా పీఈటీ మాట్లాడుతూ స్వీజ నార్సింగిలోని బాక్సింగ్ అకాడమీలో శిక్షణ పొందుతుందని, డిసెంబర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటుందని, అందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. స్వీజను పాఠశాల సిబ్బంది అభినందించారు. జాతీయస్థాయిలో సైతం రాణించి పతకం సాధించాలని ఆకాంక్షించారు.

ఎంపీవో, సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ

రాజంపేట,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నూతన ఎంపీవో బాబర్ ఇమాముద్దిన్, సూపరిటెండెంట్ జనార్ధన్‌లు బాధ్యతలు స్వీకరించారు. గ్రూప్-2 రిక్రూట్‌మెంట్‌లో బాబర్ ఇమాముద్దిన్ రాగా, జనార్ధన్ కామారెడ్డి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ పీఆర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ నుంచి పదోన్నతిపై కార్యాలయానికి వచ్చినట్లు ఎంపీడీవో బాలకృష్ణ తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత



చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న చైర్మన్

కామారెడ్డిటౌన్,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలానికి చెందిన రిటైర్డ్ జూనియర్ లెక్చరర్ చంద్రశేఖర్ గ్రంథాలయానికి అడ్వాన్స్‌డ్ ఇంగ్లీష్ లెర్నింగ్ పుస్తకాలను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి చంద్రశేఖర్‌ను అభినందించారు. ఇలాంటి విరాళాలు పాఠకుల్లో చదవాలనే ఆసక్తిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- బాహుబలి (ది ఎపిక్)
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి జటాధర
వెంకటేశ్వర మాస్ జాతర

చికెన్ ధరలు

రకం	సుగుణ	పెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230